**ఆకాశవాణి విజయవాడ కేంద్రం**

**ప్రాంతీయవార్తా విభాగం 16-05-2012, గం॥ 6.45 ని॥**

# హెడ్‌లైన్స్

1. రాష్ట్రరోడ్డు రవాణాసంస్థ ఆర్‌టిసి కొత్తగా 5 వేల గ్రామాలకు గ్రామీణ బస్సులు నడుపుతుందని సంస్థ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బి.ప్రసాదరావు చెప్పారు.
2. రాష్ట్ర సమాచార కమీషనర్లుగా ఇటీవల నియమితులైన నలుగురు నిన్న ప్రమాణ స్వీకారం చేశారు.
3. ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈరోజు ప్రారంభమవుతున్నాయి.
4. వంశధార ప్రాజెక్టు నిర్మాణం వల్ల నష్టపోయిన నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడానికి ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తున్నారు.

## ఆర్‌టిసి :

రాష్ట్రరోడ్డు రవాణా సంస్థ ఆర్‌టిసి రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల గ్రామాలకు కొత్తగా ఒక వెయ్యి గ్రామీణ బస్సులు నడుపుతుందని సంస్థ వైస్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బి.ప్రసాదరావు చెప్పారు. హైదరాబాద్‌లో నిన్న విలేకరులతో మాట్లాడుతూ కొన్ని గ్రామాలకు రహదారులు సక్రమంగా లేకపోవటంతో బస్సులు నడపలేకపోతున్నామని అయితే ప్రజల సహకారంతో పెద్ద సంఖ్యలో గ్రామీణ బస్సులు నడుపుతామని ఆయన చెప్పారు. ప్రభుత్వం గత ఏడాది సంస్థకు మంజూరు చేసిన 200 కోట్ల రూపాయలలో 400 కొత్త బస్సులు కొనుగోలు చేశామని, కాలం చెల్లిన బస్సులను రద్దుచేశామని, ప్రసాదరావు తెలియజేశారు. ప్రభుత్వ అనుమతి లభించిన తరువాత ఆర్‌టిసి లో ఖాళీగా ఉన్న డ్రైవర్లు, కండెక్టర్లు, మెకానిక్ ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రసాదరావు తెలియజేశారు.

యుయన్ఐ

-------------

## ఆర్‌పిఐ :

రాష్ట్ర సమాచార కమీషనర్లుగా ఇటీవల నియమితులైన నలుగురు నిన్న పదవీ బాధ్యతలు స్వీకరించారు. విశ్రాంత ఐపియస్ అధికార్లు యస్.ప్రభాకర్‌రెడ్డి, యమ్.రతన్, విశ్రాంత ఐఎఫ్‌యస్ అధికారి సి.మధుకర్‌రాజ్, సీనియర్ జర్నలిస్ట్ కమీషనర్లుగా ప్రభుత్వం ఇటీవల నియమించిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రధాన సమాచార కమీషనర్ జన్నత్‌హుస్సేన్ నిన్న హైదరాబాద్‌లో వీరిచేత పదవీ స్వీకార ప్రమాణం చేయించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది మంది సమాచార కమీషనర్లు నియమించాలని నిర్ణయించగా రాష్ట్ర గవర్నర్ ఇయస్‌యల్ నరసింహన్ ఈ నలుగురి నియామకానికి ఆమోదం తెలిపారు.

యుయన్ఐ

-------------

## ఎక్జామ్స్ :

ఇంటర్‌మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈరోజు ప్రారంభమవుతున్నాయి. మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 8 గంటలనుంచి 11 గంటల వరకు, రెండవ సంవత్సరం పరీఓలు మధ్యాహ్నం 2 1/2 గంటల నుండి 5 1/2 గంటల వరకు నిర్వహిస్తారు. విద్యార్థుల సౌకర్యం కోసం సంప్రదాయానికి భిన్నంగా ఈరోజు ఫిజిక్స్ పరీక్షలతో సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ఈనెల 25వ తేదీ వరకు ఈ పరీఓలు కొనసాగుతాయి. ఇంటర్‌మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు కూడా డ్రా పద్ధతి ద్వారా ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేస్తారు. ఈ ఉదయం జరిగే ఫిజిక్స్ పేపర్ 1 పరీక్షకు సెట్ నెంబర్ 1 ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేసినట్లు ఇంటర్ మీడియట్ బోర్డు తెలియజేసింది.

ఇంటర్‌బోర్డు

--------------

## పోర్టు :

బందర్‌పోర్టు ముఖద్వారం అభివృద్ధికి 60 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు తయారు చేసినట్టు ఓడరేవులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి జి.శ్రీనివాసరావు చెప్పారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో ఆయన నిన్న విలేకర్లతో మాట్లాడుతూ మత్స్యకారుల వృత్తిని మెరుగుపర్చేందుకు, పోర్టు నిర్మాణానికి దోమదపడే విధంగాను సముద్ర ముఖద్వారారిన్న దశల వారీగా అభివృద్ధి చేస్తామని, 2014 నాటికి కొన్ని బెర్తలను పూర్తిచేస్తామని తెలిపారు. అతి త్వరలో అభివృద్ధి పనులు చేపడతామని మంత్రి తెలియజేశారు. ఈ సమావేశంలో మంత్రి కె.పార్ధసారధి, విప్‌పేర్నినాని, శాసనసభ్యులు జోగిరమేష్, వి.శ్రీనివాస్ పోర్టు శాఖ డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డెస్క్

--------------

## వాటర్ :

జిల్లా పరిషత్, మండలపరిషత్ సాధారణ నిధుల నుంచి 34 శాతం తాగునీటి అవసరాలకు ఉపయోగించుకోవడానికి ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ మేరకు పంచాయితీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి సి.ఆర్.బిస్వాల్ నిన్న ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ వెసులుబాటు కల్పించిందని బిస్వాల్ తెలిపారు.

డెస్క్

--------------

## రైల్వే :

సికిల్‌సెల్, ఎనీమియా, ఎప్లాస్టిక్ ఎనీమియా తులసీమియా వ్యాధులతో భాధపడే రోగులకు వచ్చేనెల జూన్ ఒకటవ తేదీ నుండి, రైతుల ప్రయాణంలో 50 శాతం రాయితీ కల్పిస్తున్నాట్టు దక్షిణ మధ్యరైల్వే ప్రజా సంబంధాల ముఖ్య అధికారి కె.సాంబశివరావు తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన వైద్యాధికారి జారీ చేసే ధృవీకరణ పత్రాల ఆధారంగా సంబంధిత రైల్వే స్టేషన్ మాస్టర్లు ఈ రాయితీని కల్పిస్తారు. తమ నివాసాల నుంచి ఆసుపత్రులకు వెళ్ళి వైద్య సేవలు పొందేవారికి వైద్య పరీక్షల నిమిత్తం వెళ్ళేవారికి ఈ రాయితీ వర్తిస్తుందని రాజధాని, శతాబ్ది, జనశతాబ్ది, గరీబ్‌రధ్, దురంతో వంటి రైళ్ళలో మాత్రమే ఈ రాయితీ వర్తించదని సాంబశివరావు స్పష్టం చేశారు.

డెస్క్

--------------

## ఎయిర్ ఇండియా :

సమ్మెబాట పట్టిన పైలెట్ల డిమాండ్లను నెరవేరుస్తూ ఎయిర్ ఇండియాకి ఉద్దీపన ప్యాకేజీ ఇవ్వనున్నట్టు కేంద్ర విమానయానశాఖ మంత్రి అజిత్‌సింగ్ నిన్న కొత్త ఢిల్లీలో వెల్లడించారు. ఈ సమ్మెతో ఎయిర్ ఇండియాకి 150 కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లిందని పైలెట్లు వెంటనే విధులకు హాజరవ్వాలని ఆయన అన్నారు.

డెస్క్

--------------

## వెదర్ :

ఛత్తీస్‌ఘడ్ నుంచి దక్షిణకోస్తా తెలంగాణ మీదుగా అల్పపీడన ద్రోణి ఉపరితల ద్రోణి కొనసాగుతున్నాయి. వీటి ప్రభావంతో ఈరోజు రాత్రి వరకు కోస్తా, తెలంగాణాల్లో ఒక ట్రెండు చోట్ల రాయలసీమలో అక్కడక్కడ వురుములతో కూడిన జల్లులు, వానలు కురిసే అవకాశంఉందని విశాక పట్నంలోని తుపాను హెచ్చరికల కేంద్రం తెలియజేసింది. కాగా గత రెండు రోజుల్లో చింతపల్లి బొబ్బిలి చోడవరం, పార్వీతీపురం, ధర్మవరం,కొమరాడలలో ఒక సెంటీమీటర్ చొప్పున వర్షం కురిసింది.

డెస్క్

-------------

## బ్రేక్

## ప్రాజెక్టు :

వంశధార ప్రాజెక్టు నిర్మాణం వల్ల నష్టపోయిన నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ జి.వెంకట్రామిరెడ్డి తెలిపారు. నిన్న ఆయన హిరమండలం మండల అభివృద్ధి కార్యాలయంలో వంశధార, పంచాయితీరాజ్, ఆర్‌డబ్ల్యూయస్, గృమ నిర్మాణ శాఖల అధికార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రానున్న ఆరునెలల్లో రిర్వాసితులకు కేటాయించిన 17 కాలనీ పనులు పూర్తి చేసి అన్ని వసతులతో నిర్వాసితులకు అప్పగించాలని అధికార్లను ఆదేశించారు. వారంలో ప్రతి శు క్రవారం కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ గ్రీవెన్స్ సెల్ పనిచేస్తుందని ఆయన తెలిపారు.

పిటిసి – శ్రీకాకుళం

--------------

## బిజెపి :

రాష్ట్రంలో వచ్చే జూన్ 12 వ తేదీన జరగబోయే ఉప ఎన్నికల్లో వరంగల్ జిల్లా ఎరాకాలో ఎసెంబ్లీ స్థానానికి పోటీచేస్తున్న బిజెపి అభ్యర్థికి టిఆర్‌యస్ మద్దతు ఇవ్వవలసిందిగా కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ కోరారు. హైదరాబాద్‌లో నిన్న విలేకరులతో మాట్లాడుతూ దత్తాత్రేయ ఒకటి, రెండు రోజుల్లో అభ్యర్థి పేరు ప్రకటిస్తామని ఆయన అన్నారు. తెలంగాణా ప్రజలు, ఏరాకాలో ఓటర్లు ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు బిజెపి తోనే సాధ్యం అవుతుందని గ్రహించాలని బండారు దత్తాత్రేయ అన్నారు.

యుయన్‌ఐ

--------------

## ఉప ఎన్నికలు :

పశ్చిమ గోదావరి జిల్లాలోని పోలవరం నరసాపురం నియోజకవర్గాల్లో ఉప ఎన్నికల నేపథ్యంలో 28 లక్షల 77 వేల రూపాయల నగదును 410 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు జిల్ల కలెక్టర్ వాణీమోహన్ తెలిపారు. 21 ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకున్నామని వివిధ కేసులకు సంబంధించి 155 మందిని బైండోవర్ చేసినట్టు కలెక్టర్ చెప్పారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన 63 వేల 403 జెండాలు, 1904 బ్యానర్లు, 408 ఫ్లెక్సీ బోర్డులు, 42 కటౌట్లు తొలగించినట్టు కలెక్టర్ తెలిపారు.

ఏలూరు

--------------

## సబ్‌కమిటీ :

మహబూబ్ నగర్ జిల్లాలో ఎస్సిసి, ఎస్‌టి ఉప ప్రణాళిక కింద అమలు జరుగుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాల్ని పరిశీలించేందుకు ఈనెల 25న మంత్రి మండలి ఉప సంఘం జిల్లాకు రానున్నట్టు కలెక్టర్ యమ్.పురుషోత్తమ రెడ్డి తెలిపారు. ఈ క్యాబినెట్ సబ్‌కమిటీకి ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింమ క్యాబినెట్ మంత్రులు సభ్యులుగా ఉన్నారని కలెక్టర్ వెల్లడించారు. రాష్ట్రంలో మొదటిసారిగా ఉపసంఘం ఈరోజు నల్గొండలో సమావేశం నిర్వహించనుంది. గుర్తింపు పొందిన షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల సంఘాలతో కమిటి సమావేశమై సూచనలు, సలహాలు స్వీకరిస్తుంది.

డెస్క్

--------------

## పోలీస్ :

కరీంనగర్ జిల్లాలో గ్రామ రక్షక దళాలను పటిష్టం చేయ్యడం వల్ల గతంలో కన్నా నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టిందని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రవీందర్ తెలిపారు. మాజీ ప్రజాప్రతి నిధులపై మావోయిస్టుల దాడి నేపథ్యంలో నిన్న ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌ని తనిఖీ చేసిన అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ గ్రామరక్షక దళ వ్యవస్థ సత్ఫలితాలిస్తోందని పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా మెట్‌పల్లిలో గల్ఫ్ మోసాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తామని ఆయన తెలియజేశారు. గ్రామ పోలీసు వ్యవస్థ ఏర్పాటుతో ప్రజలకు పోలీసులతో సంబంధాలు మెరుగుపడ్డాయని ఎస్పీ అన్నారు.

డెస్క్

-------------

## వాటర్ :

వైయస్ఆర్ కడప జిల్లా రాజంపేట మండలంలో దాదాపు 2 వేల ఎకరాల్లో అరటి, 3 వందల ఎకరాల్లో బొప్పాయి తోటలు బోరుబావుల్లో నీరు అడుగంటి పోవడంతో ఎండిపోతున్నాయని రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో ఎన్నడూలేని విధంగా భూగర్భజలాలు 700 అడుగులకు పడిపోయాయని మా కడప విలేకరి శశిశ్రీ తెలయిజేస్తున్నారు. కాగా లింగాల మండలంలో లింగాల కుడి కాలువ నీరు లేక చేనే తోటలు ఎండిపోతున్నాయని కూడా ఆయన తెలియజేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని రైతులను కాపాడాలని రైతుల విజ్ఞప్తి చేస్తున్నారు.

పిటిసి – వైయస్ఆర్‌కడప

--------------

## అమర్‌నాథ్ యాత్ర :

అమర్‌నాథ్ యాత్రపై ప్రభుత్వం ఆంక్షలు తొలగించాలని విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు ప్రవీన్ భాయ్ గాడియా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా రామాయంపేటలో నిన్న విలేకర్లతో మాట్లాడుతూ నెలరోజుల యాత్ర జరుపుకోవాలనే ఆంక్షలను హిందువులు హర్షించరని స్పష్టంచేశారు. జమ్ముకాశ్మీర్‌లో జ్యేష్ట అమావాస్య నుంచి శ్రావణ అమావాస్య వరకు ఏటా రెండు నెలలపాటు అమర్‌నాథ్ ఉత్సవాలను నిర్వహించాలని ఆయన కోరారు. కాగా గత ఏడాది అమరనాథ్ యాత్రలో భాగంగా 8 లక్షల మంది భక్తులు మంచుతో కప్పబడిన శివలింగాన్ని దర్శించారు.

డెస్క్

--------------

## మీ–సేవ :

మీ–సేవ కేంద్రాల ద్వారా అందించే వివిధ సేవల వివరాలను చార్టులపై వివరంగా రాసి ప్రతికేంద్రంలో ప్రజలకు తెలిపే విధంగా సిటిజన్ చార్టర్ డిస్‌ప్లే చెయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ వి.శేషాద్రి ఆదేశించారు. ఆయన నిన్న కుత్బుల్లాపూర్ మండలపరిధిలోని బాచుపల్లి వద్ద మీసేవ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీసేవా కేంద్రాల ద్వారా తక్కువ సమయంలో మెరుగైన సేవలు అందించనున్నామని, సిటిజన్ చార్టర్‌లో సూచించిన విధంగా నిర్దేశించిన కాలపరిమితిలో ఆయా సేవలను అందించాలని, కులధృవీకరణ పత్రాలను జారీ చేసేటప్పుడు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు.

పిటిసి–రంగారెడ్డి

...................